త్రినేత్ర
సత్యం ధర్మం జ్ఞానం
Hyderabad
28 April, 2026
7:30 PM Edition
www.trinethra.news
360° Digital News

# డబ్బులు తీసుకోండి..



# భూములివ్వండి

## ఫ్యూచర్ సిటీకి సహకరించండి

- ఇది ఆగే పని కాదు
- రైతులు భూములివ్వాల్సిందే
- ఈ రోజు కాకపోయినా.. రేపైనామీరు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది
- సింగపూర్, టోక్యోలకు దీటుగా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం
- ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి

ఫ్యూచర్ సిటీ కోసం రైతులు భూములు ఇవ్వాల్సిందే.. ఇది ఆగేపని కాదు.. ఈ రోజు కాకపోయినా రేపైనా మీ భూములు ప్రభుత్వానికి బదిలీ అవుతాయి. ఇక్కడ ఇచ్చిన డబ్బులతో ఇంకోచోట భూములు కొనుక్కోండి. ఇప్పటికే ఆలస్యమైంది.

హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ మాదిరిగానే.. నాలుగో నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నాం.... అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మంగళవారం ఆయన మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన చేశారు.

వివరాలు 3 లో..



మీర్‌ఖాన్ పేటలో ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



# రేపే పది ఫలితాలు

త్రినేత్ర.న్యూస్:

తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాలు రేపు విడుదల కానున్నాయి. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెలువడుతాయని ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఈ ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. గత నెల 14వ తేదీ నుంచి ఈ నెల 13వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.15 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు హాజరయ్యారు.

# అక్రమ కేసులు బంజెయ్

- ఆరు గ్యారంటీలు అమలు చెయ్
- ఏడో గ్యారంటీ ప్రశ్నించే హక్కు అన్నవ్.. ఏమైంది
- ప్రశ్నించే గొంతులను అణచివేసుడే నీ పనా?
- పంటలు కొనే తెలివి లేదా?
- ఇదేం పాలన? ఇది ప్రజాస్వామ్యమేనా?
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం

2





# తెలంగాణ కొత్త డీజీపీ సీవీ ఆనంద్

త్రినేత్ర.న్యూస్ :

తెలంగాణ కొత్త డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. 1991వ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్ పూర్తిస్థాయి డీజీపీగా రెండేండ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి ఏప్రిల్ 31న పదవీ విరమణ చేయనున్నారు. సీవీ ఆనంద్.. తెలంగాణకు మూడో పూర్తి కాలపు డీజీపీగా రెండేండ్ల పాటు కొనసాగనున్నారు.



## బీజేపీపై ఎక్కు పెట్టిన అస్త్రమే సేవాదళ్

- నేటి నుంచి మే 2 వరకు సమర్థ శిక్షణ శిబిరం
- సేవాదళ్ కార్యక్రమ ప్రారంభంలో మహేశ్‌కుమార్ గౌడ్

త్రినేత్ర.న్యూస్:


దేశ స్వతంత్ర పోరాటం నుంచే సేవాదళ్ క్రియాశీలక కార్యక్రమాలు కొనసాగిస్తోందని, సెంట్రల్ బాడీలో ఉంటూ బీజేపీ అవలంబిస్తున్న ధోరణులను ఎప్పటికప్పుడు ఎండగడుతోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించే సమర్థ్ శిక్షణ శిబిరాన్ని ఆయన సేవాదళ్ జాతీయ అధ్యక్షుడి లాల్‌జీ దేశాయ్ తో కలిసి మంగళవారం ప్రారంభించారు. నేటి నుంచి మే 2 వరకు ఆరు రోజుల పాటు సేవాదళ్ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. పదేండ్లుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్.. కవిత ప్రశ్నలకు సమాధానం కచ్చితంగా చెప్పాల్సిన పరిస్థితి ఉందని అన్నారు.

# మరోసారి పెట్రోల్ కష్టాలు

- హైదరాబాద్‌లో బంకుల వద్ద భారీ క్యూలైన్లు

**హైదరాబాద్ నగరంలో మరోసారి పెట్రోల్ కష్టాలు మొదలయ్యాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచే పలు పెట్రోల్ బంకుల వద్ద కిలోమీటర్ల మేర వాహనదారులు బారులు తీరారు. ద్విచక్ర వాహనదారులతో పాటు ఫోర్ వీలర్, త్రీ వీలర్ వాహనాలు కూడా బారులు తీరాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద రద్దీని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సి వస్తుంది.**





త్రినేత్ర.న్యూస్ :

ఇక కొన్ని పెట్రోల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా పెట్రోల్ బంకుల వద్దకు వచ్చిన జనం వెనుతిరిగిపోతున్నారు. తెరిచి ఉన్న పెట్రోల్ బంకుల వద్ద ఫుల్ ట్యాంక్ చేయించుకునేందుకు వాహనదారులు ఎగబడుతున్నారు.

ఇది ఇలా ఉంటే తెలంగాణ పౌర సరఫరాల అధికారులు మాత్రం రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ అంశంపై నిన్న అధికారిక ప్రకటన వెలువడింది కూడా. సోషల్ మీడియాలో ఇంధనం దొరకదని వస్తున్న వార్తలు పూర్తిగా పుకార్లేనని, ప్రజలు వాటిని నమ్మవద్దని కోరింది. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రయాణికులు, రవాణా రంగం, రైతులకు అవసరమైనంత ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని వెల్లడించింది. పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఆయిల్ కంపెనీలతో కలిసి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

తాజా లెక్కల ప్రకారం రాష్ట్రంలో రోజుకు 7,443 కిలోలీటర్ల పెట్రోల్, 11,081 కిలో లీటర్ల డీజిల్ సరఫరా అవుతుండగా, మొత్తం 18,524 కిలోలీటర్ల ఇంధనం నిరంతరంగా అందుబాటులో ఉందని పేర్కొంది. ఇంధనం అందరికీ సకాలంలో చేరేందుకు ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని, అనవసరంగా భయపడి పెట్రోల్ బంకుల వద్దకు పరుగులు తీయొద్దని విజ్ఞప్తి చేసింది. ప్రమాదాలకు దారితీసేలా ఇళ్లలో అక్రమంగా పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని హెచ్చరించింది. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రజలు ఓపికతో వ్యవహరించాలని, పెట్రోల్ బంక్ సిబ్బంది, స్థానిక పోలీసులకు సహకరించాలని సూచించింది. ప్రభుత్వం విడుదల చేసే అధికారిక సమాచారాన్నే నమ్మాలని స్పష్టం చేసింది.

# అక్రమ కేసులు బంజెయ్

- ఆరు గ్యారంటీలు అమలు చెయ్
- ఏడో గ్యారంటీ ప్రశ్నించే హక్కు అన్నవ్.. ఏమైంది
- ప్రశ్నించే గొంతులను అణచివేసుడే నీ పనా
- పంటలు కొనే తెలివి లేదా?
- ఇదేం పాలన? ఇది ప్రజాస్వామ్యమేనా?
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం

త్రినేత్ర.న్యూస్:



**• ప్రశ్నించే హక్కును రాజ్యాంగం ఇవ్వలేదా?**

అంగన్‌వాడీ మొబైల్ స్కాం మీద ప్రశ్నిస్తే కేసు, పదో తరగతి ప్రశ్న పత్రం లీక్ అయిందంటే క్రిశాంక్ మీద కేసు, కంచె గచ్చిబౌలి భూముల మీద అడిగితే అక్కడా కేసు, మిస్ వరల్డ్ పోటీల్లో మిస్ ఇంగ్లండ్ పట్ల కాంగ్రెస్ వ్యవహరించిన తీరుపై ప్రశ్నిస్తే క్రిశాంక్ మీద కేసు. ఇలా ఎన్ని కేసులు పెడుతరు? అనుముల మహానందరెడ్డి ఒక కేసులో ఇన్‌వాల్వ్ అయ్యాడు. అందులో అందరిని అరెస్టు చేసి ఆయన్నే ఎందుకు అరెస్టు చేయలేదు? అడగడమే నేరమా? ప్రశ్నించే హక్కు భారత రాజ్యాంగం పౌరులకు ఇవ్వలేదా?

అక్రమ కేసులు బంజేసి, ఆరు గ్యారంటీల మీద సోయి పెట్టాలని, రైతులను పట్టించుకోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి కంది జైలులో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్ ను మంగళవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్ రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

క్రిశాంక్‌తో పాటు మరో ఏడుగురు బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి జైల్లో పెట్టారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నరు. అహంకారపూరిత, రాచరిక ధోరణిని అవలంబిస్తున్నరు. ఆనాడు ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీ ప్రశ్నించే హక్కును కల్పిస్తమన్నరు. ఈరోజు ఎవరు మాట్లాడినా విజిలెన్స్ విచారణ, సీఐడీ విచారణ పేరుతో వేధిస్తున్నరని హరీశ్‌రావు మండిపడ్డారు.

**ఫేక్ వార్తలు పెట్టినోళ్లను ఇళ్లకు పంపిండ్రు..**

కేసీఆర్, కేటీఆర్ మీద ఫేక్ పోస్టులు పెడుతున్నరు, తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నరని, మొబైల్‌లో ఆధారాలున్నాయని పోలీసులకు ఒక మొబైల్ క్రిశాంక్ అందించిండు. తప్పుడు వార్తలు ప్రసారం చేస్తున్నవారి మీద కేసులు పెట్టాల్సింది పోయి, ఫిర్యాదు ఇచ్చిన క్రిశాంక్, బీఆర్ఎస్ నాయకుల మీద కేసులు పెట్టుడు ఎంత వరకు న్యాయం? ఫోన్ తీసుకుంటే ఎవరన్న నాన్‌బెయిలబుల్ కేసు పెడతరా? మేజిస్ట్రేట్ ఈ కేసును కొట్టేసిండు. ఇంకా తప్పుడు కేసులు ఉన్నయని చెప్పి జైల్లో పెట్టారు. క్రిశాంక్ హత్య చేసిండా, రేప్ చేసిండా, తప్పు చేసిండా? ఎట్ల పెడుతరు కేసులు అని ఆయన ఫైరయ్యారు.

**మా ఫోన్లు, సీసీ కెమెరాలు హ్యాక్ చేయిస్తున్నవ్..**

జూబ్లీహిల్స్ ప్యాలెస్ ల కూసోని నేనే రాజు, నేనే మంత్రి అనుకుంటున్నవ్. జూబ్లీహిల్స్ ప్యాలెస్ చాలదన్నట్టు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో వంద కోట్లతో కొత్త ప్యాలెస్ కట్టుకుంటున్నావు. కొంత మంది ఐపీఎస్ అధికారులు మా ఫోన్లు, మా ఇళ్ల ముందు ఉన్న సీసీ కెమెరాలు హ్యాక్ చేస్తున్నరు. బెంగళూరు నుంచి ప్రైవేట్ హ్యాకర్లను తీసుకొచ్చి కమాండ్ కంట్రోల్ రూంలో పెట్టి హ్యాక్ చేస్తున్నరు. ఐపీఎస్ అధికారులను హెచ్చరిస్తున్న. మా దగ్గర అన్ని ఆధారాలున్నయి. రేపు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదిలిపెట్టం. మీరు చట్టం నుంచి తప్పించుకోలేరు.

**వచ్చి కొనుగోలు కేంద్రాలు చూడు..**

యాసంగి సన్నవడ్లకు బోనస్ ఇస్తావా? ఇవ్వవా? స్పష్టం చెయ్. శనగలు, పొద్దుతిరుగుడు రైతులు 20 రోజుల నుంచి పడిగాపులు గాస్తున్నరు. మక్కలు కొనే దిక్కే లేదు. ఎకరాకు 26 క్వింటాళ్లే కొంటమని కొత్త షరతు పెట్టినవ్. 13 లక్షల ఎకరాల్లో మక్కలు పండినయి. సగం కూడా ప్రభుత్వం కొనలే. వడ్ల కొనుగోలు కేంద్రాలు మొదలే కాలే. తాలు పేరు మీద కటింగులు పెడుతున్నరు. రా ఒక్కసారి రా.. రేవంత్ రెడ్డి ఒక్కసారి వచ్చి కొనుగోలు కేంద్రాలు చూడు అని హితవుపలికారు.

## పైలట్ రోహిత్‌రెడ్డికి బెయిల్

- హైకోర్టులో ఊరట

త్రినేత్ర.న్యూస్:




మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. ఆయనకు రాష్ట్ర హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రోజూ దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని ఆదేశించింది. పాస్ పోర్టును పోలీసులకు సరెండర్ చేయాలని షరతు విధించింది. దర్యాప్తునకు సహకరిస్తూనే, మరోవైపు సాక్షులను ప్రభావితం చేయొద్దని ఆదేశించింది. ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో పోలీసులు కేసు నమోదు చేసి రోహిత్‌రెడ్డితో పాటు మరో ఇద్దరిని గత మార్చి 14న అరెస్టు చేశారు. అనంతరం రిమాండ్‌కు తరలించారు. డ్రగ్స్ తీసుకోవడమే కాకుండా తనిఖీల కోసం వెళ్లిన ఎస్‌వోటీ పోలీసులపై కాల్పులు జరిపేందుకు యత్నించగా పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో ఉప్పర్‌పల్లి కోర్టులో రోహిత్‌రెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా దాన్ని కోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో పైలట్ ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించగా, వాదనలు ముగిసి, ఇవాళ హైకోర్టు ఉత్తర్వులు వెలువరించింది.



తెలంగాణ మత్స్య అభివృద్ధికి సహకరించాలని కేంద్ర పశుసంవర్ధక పాడి పారిశ్రామికాభివృద్ధి మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ను రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. రాజేంద్రనగర్ లోని కార్యాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక భేటీ అయ్యారు. మత్స్య శాఖ డైరెక్టర్ నిఖిల, పశు సంవర్ధక శాఖ అధికారి లక్ష్మీ నారాయణ తదితరులు ఉన్నారు. - త్రినేత్ర.న్యూస్



## తెలంగాణకు వర్ష సూచన..!

- **ఆరెంజ్ అలర్ట్ జారీ..!!**

**త్రినేత్ర.న్యూస్ :**

తెలంగాణ వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్న నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం చల్లని కబురు అందించింది. రాబోయే నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మే 1వ తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, నాగర్‌కర్నూల్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పలు ప్రాంతాల్లో వడగళ్ల వాన కూడా కురిసే అవకాశం ఉంది. గంటకు 41 నుంచి 61 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.



## నల్గొండను సస్యశ్యామలం చేస్తాం

- **మంత్రి కోమటిరెడ్డి**

**త్రినేత్ర.న్యూస్:**

నల్గొండ జిల్లాను సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేసి ప్రతి ఎకరాకు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పంటలకు మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ జిల్లా రూపురేఖలు మార్చేలా రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

# డబ్బులు తీసుకోండి.. భూములివ్వండి

- **ఫ్యూచర్ సిటీకి సహకరించండి**
- **ఈ రోజు కాకపోయినా .. రేపైనామీరు ప్రభుత్వానికి ఇవ్వాల్సి ఉంటుంది**
- **ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ శంకుస్థాపనలో సీఎం రేవంత్ రెడ్డి**



**త్రినేత్ర.న్యూస్ :**

ఫ్యూచర్ సిటీ కోసం రైతులు భూములు ఇవ్వాల్సిందే.. ఇది ఆగేపని కాదు.. అంతా అయిపోయింది అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రోజు కాకపోయినా రేపైనా మీ భూములు ప్రభుత్వానికి బదిలీ అవుతాయని సీఎం తెలిపారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్‌కు శంకుస్థాపన సందర్భంగా సీఎం ప్రసంగించారు. దేవేందర్ గౌడ్ వల్లే ఈ ప్రాంతానికి పేరు వచ్చింది. ఫ్యూచర్ సిటీలో కొంత మంది రైతులకు నష్ట పరిహారం రాలేదని కొంత నిష్ఠూరకం ఉంది. ఈ నష్ట పరిహారం సమస్య పరిష్కరిస్తే స్థానిక ప్రజాప్రతినిధులు చరిత్రలో మిగిలిపోతారు. నష్టం చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదు. కచ్చితంగా రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది అని, లీగల్ లిటిగేషన్లు లేకుండా చూడాలని స్థానిక ప్రజాప్రతినిధులను సీఎం కోరారు.

ఈ ప్రాంత ప్రజలకు, రైతులకు విజ్ఞప్తి చేస్తున్నా.. లీగల్ ప్రాసెస్ అంత కంప్లీట్ అయింది. ఈ రోజు కాకపోతే రేపైనా భూమి ప్రభుత్వానికి బదిలీ అవుతుంది. అది ఆగే అవకాశం లేదు. తాత్కాలికంగా వాయిదా పడొచ్చు. కానీ భూముల బదిలీ జరిగి తీరుతుంది. ఆనాడు పైసలు తీసుకుంటే కల్వకుర్తి అవతలికి పోతే మీకు రెండింతల భూమి వచ్చేది. ఇప్పుడు ధరలు పెరిగాయి. ఈ పైసలతో గజాలు కొనడానికి కూడా సరిపోవు. డబ్బులు తీసుకోండి.. కొంచెం దూరం వెళ్లి భూమి కొనుక్కోండి. మీ పిల్లలకు స్కిల్ యూనివర్సిటీలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిద్దాం. ఇతర అవకాశాలు కల్పిద్దాం. రైతుల బాధ వినండి.. గుంజుకుంటున్నారన్న అభద్రతాభావం కల్పించొద్దు. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులకు చోటు కల్పించాలని రేవంత్ ఆదేశించారు.

జూపల్లి కృష్ణారావు ఇండస్ట్రీస్ మినిస్టర్‌గా ఉన్నప్పుడే 90 శాతం భూములు క్లియర్ అయ్యాయి. ఆ రోజే డబ్బులు తీసుకుంటే యాచారం, కడ్తాల్, ఆమనగల్ వద్ద భూములు వచ్చేవి. ఇప్పుడు ఆ అవకాశం కూడా పోయింది. రోజురోజుకు ధరలు పెరుగుతున్నాయి. ఐదు ఎకరాలు కొనుక్కుందాం ఫ్యూచర్ సిటీ వద్ద అని కొందరిని అడిగితే.. ఆరు నెలల కింద మూడు కోట్లు, ఇప్పుడు 6 కోట్లు అని చెబుతున్నరు. కొనుక్కొనేందుకు మా స్థాయి దాటిపోయింది. ఫ్యూచర్ సిటీలో మాకు భూమి లేదనుకునే పరిస్థితి వచ్చింది. ధరలు పెరుగుతూనే ఉన్నాయి. రైతులు డబ్బులు తీసుకోవాలి.. భూములు ఇవ్వాలి. పేదల పట్ల మానవీయ కోణంలో వ్యవహరించండి.. అభివృద్ధిలో భాగస్వాములవుతున్నారు.. కాబట్టి వారి పట్ల సానుకూలంగా వ్యవహరించండి.. సమస్యలను పరిష్కారం చేద్దాం. బిల్ గేట్స్, బిల్ క్లింటన్, ట్రంప్, ఎలాన్ మస్క్ అయినా ఇక్కడికి రావాల్సిందే. ఈ నగరంలో పెట్టుబడులు పెట్టకపోతే ఏదో కోల్పోయామన్న పరిస్థితిని ఈ ప్రభుత్వం తీసుకువస్తుంది అని సీఎం రేవంత్ అన్నారు.

# రైతులను కాంగ్రెస్ మోసం చేస్తున్నది..

- **రైతు డిక్లరేషన్ మోసాన్ని గుర్తు చేస్తూ వరంగల్‌లో కార్యక్రమాలు**
- **డిక్లరేషన్ ఇచ్చిన మే 6న సమావేశం**
- **ఉమ్మడి వరంగల్ నేతలతో కేటీఆర్ సమావేశం**
- **పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై దిశా నిర్దేశం**



**త్రినేత్ర.న్యూస్:**

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని అన్ని రకాలుగా మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ల కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట నాలుగు సంవత్సరాల కిందట అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా తన కపట మోసాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. స్వయంగా రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ రైతన్నలను మోసం చేసిన మే 6వ తేదీని పురస్కరించుకొని రైతన్నలతో ఒక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ ప్రకటించింది. సమావేశానికి హాజరుకావాలని కేటీఆర్‌ను ఆహ్వానించింది.

**ఆత్మహ్యతలపై ఆందోళన..**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయరంగంలో తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అడ్రస్ లేకుండా పోయిన రైతు ఆత్మహత్యలు కాంగ్రెస్ పాలనలో తిరిగి ప్రారంభమయ్యాయని, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలు ప్రక్రియ సక్రమంగా సాగక రైతన్నలు తీవ్రమైన ఇబ్బందుల్లో ఉన్నారని పార్టీ నేతలు కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు.

**సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం..**

ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ పై నేతలు కేటీఆర్‌కు పలు వివరాలు అం దజేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు వంటి సంస్థాగత అంశాలపై కేటీఆర్ జిల్లా పార్టీ నాయకులకు కీలక సూచనలు చేశారు. త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై నేతలతో కేటీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. విజయం కోసం వారికి దిశానిర్దేశం చేశారు.

**సర్‌పై సూచనలు..**

ఎన్నికల సంఘం నిర్వహించనున్న స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యక్రమాన్ని ముఖ్యాంశంగా పరిగణించాలన్నారు. ప్రతి బూత్ లో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నేతలకు సూచించారు. ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమాన్ని వినియోగించుకొని కొత్త ఓటర్లను నమోదు చేయించడంతోపాటు ఏ ఒక్క వ్యక్తికి ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత తీసుకోవాలని పార్టీ నేతలను కోరారు. ఇందుకు సంబంధించి బూత్ లెవెల్ సహాయకుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వ.. అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

# ఎస్ఐఆర్ పై అనుమానాలున్నాయి

- **మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్**
- **ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా జరగాలి**
- **ఎన్నికల సీఈవోకు విజ్ఞప్తి**

**త్రినేత్ర.న్యూస్ :**



రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – ఎస్ఐఆర్ కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం అప్రమత్తమైంది. జూన్ నెల నుంచి ప్రారంభం కానున్న ఈ ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆ పార్టీ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని కోరారు. ఈ మేరకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, వినతిపత్రం అందజేశారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ నడుస్తున్నప్పటికీ, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఇది మరింత కీలకంగా మారిందని వినోద్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఓటర్ల నుంచి కొత్త ఫోటోలు సేకరించాలని అధికారులు చెబుతున్నారని, దీనిపై గ్రామీణ స్థాయి ప్రజల్లో సరైన అవగాహన లేదని ఆయన సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ ప్రక్రియకు సంబంధించి పార్టీకి ఉన్న పలు అనుమానాలను, అభ్యంతరాలను అధికారులకు వివరించినట్లు తెలిపారు.

**డబుల్ ఓట్ల గుర్తింపుపై ఫోకస్**

తాజాగా జరగనున్న ఓటర్ల సవరణ కార్యక్రమంలో భాగంగా.. ఒక ఇంట్లో సదరు ఓటరు నిజంగానే నివాసం ఉంటున్నాడా లేదా? అన్నది అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నాయా? అన్న కోణంలోనూ ఎన్నికల సంఘం చెక్ చేయనున్నట్లు సమాచారం.

- **బూత్ లెవెల్ ఏజెంట్స్ యాక్టివ్‌గా ఉండాలి**

ఎన్నికల సంఘం నియమించే బూత్ లెవెల్ ఆఫీసర్లు మాత్రమే కాకుండా, పార్టీల తరపున ఉండే బూత్ లెవెల్ ఏజెంట్లు కూడా ఈ ప్రక్రియలో అత్యంత చురుగ్గా పాల్గొనాలని వినోద్ కుమార్ సూచించారు. ఈ టైమ్‌లో ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త అనుక్షణం అప్రమత్తంగా ఉండి ఓటర్ల జాబితా సవరణలో పారదర్శకతను కాపాడాలని స్వయంగా పార్టీ అధినేత కేసీఆర్ నిన్న జరిగిన సమావేశంలో దిశానిర్దేశం చేశారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# సంపన్నులకు కేరాఫ్ అడ్రస్
# న్యూజిలాండ్

**ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో సంపన్నులకు న్యూజిలాండ్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది. ఆ దేశం సరళీకరించిన 'గోల్డెన్ వీసా' (యాక్టివ్ ఇన్వెస్టర్ ప్లస్) పథకానికి అనూహ్య స్పందన లభిస్తోంది. కేవలం ఏడాది కాలంలోనే దాదాపు 4 బిలియన్ న్యూజిలాండ్ డాలర్ల పెట్టుబడులు రాగా, అమెరికా, చైనా కుబేరులు ఈ వీసా కోసం క్యూ కడుతున్నారు.**

- **న్యూజిలాండ్ 'గోల్డెన్ వీసా' క్రేజ్**
- **ఏడాదిలోనే ఏకంగా 4 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**
- **క్యూ కడుతున్న అగ్రరాజ్యాల కుబేరులు**



**త్రినేత్ర.న్యూస్ :**

న్యూజిలాండ్ అనగానే పచ్చని ప్రకృతి, ప్రశాంతమైన వాతావరణం ముందుగా గుర్తొస్తాయి. కానీ ఇప్పుడు ఆ దేశం ప్రపంచ కుబేరులకు, పెట్టుబడిదారులకు సరికొత్త అడ్డాగా మారింది. సురక్షితమైన, స్థిరమైన జీవనం కోసం అగ్రరాజ్యాలైన అమెరికా, చైనాలకు చెందిన సంపన్నులు న్యూజిలాండ్ వైపు చూస్తున్నారు. దీనికి ప్రధాన కారణం అక్కడి ప్రభుత్వం ఆకర్షణీయమైన మార్పులతో తీసుకొచ్చిన 'యాక్టివ్ ఇన్వెస్టర్ ప్లస్' లేదా 'గోల్డెన్ వీసా' ప్రోగ్రామ్.

**ఏడాదిలోనే 500% పెరిగిన దరఖాస్తులు**

న్యూజిలాండ్ ప్రభుత్వం తన ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించేందుకు, స్థానిక వ్యాపారాల్లోకి పెట్టుబడులను తీసుకురావడానికి గత ఏడాది ఈ గోల్డెన్ వీసా నిబంధనలను భారీగా సడలించింది. దీంతో దరఖాస్తులు ఏకంగా 500 శాతం పెరిగాయి. మార్చి 31 నాటికి 635 దరఖాస్తులు (దాదాపు 2,000 మంది వ్యక్తులు) రాగా.. ఈ స్కీమ్ ద్వారా కేవలం ఒక్క ఏడాదిలోనే సుమారు 3.905 బిలియన్ న్యూజిలాండ్ డాలర్ల (దాదాపు 4 బిలియన్లు) పెట్టుబడులను ఆకర్షించి ప్రపంచవ్యాప్తంగా హాట్ టాపిక్ అయింది. ఇందులో ఇప్పటికే 1.49 బిలియన్ డాలర్ల పెట్టుబడులు దేశంలోకి రాగా, మరో 2.415 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పైప్‌లైన్‌లో ఉన్నట్లు ఇమ్మిగ్రేషన్ మంత్రి ఎరికా స్టాన్‌ఫోర్డ్ వెల్లడించారు.

**క్యూ కడుతున్న అమెరికన్లు.. ఆపై చైనీయులే**

న్యూజిలాండ్ అందిస్తున్న గోల్డెన్ వీసా కోసం పోటీ పడుతున్న దేశాల జాబితాలో అమెరికా ముందంజలో ఉంది. మొత్తం దరఖాస్తుల్లో దాదాపు మూడో వంతు (225 దరఖాస్తులు) అమెరికా నుంచే వచ్చాయి. ఆ తర్వాత చైనా (104), హాంకాంగ్ (87), జర్మనీ (46) స్థానాల్లో ఉన్నాయి. భారత్ నుంచి కూడా రెండు దరఖాస్తులు (ఐదుగురు వ్యక్తులు) వెళ్లాయి.

## • నిబంధనల సడలింపే ప్రధాన కారణం

**ఏప్రిల్ 2025 నుంచి ఈ వీసా నిబంధనలను ప్రభుత్వం మరింత సరళీకరించడంతో ఈ జోరు పెరిగింది. ఈ గోల్డెన్ వీసా పొందాలనుకునే వారికి ప్రధానంగా రెండు మార్గాలను చూపింది.**

- **గ్రోత్ కేటగిరీ:** స్థానిక కంపెనీల్లో లేదా ఫండ్లలో మూడేళ్ల పాటు కనీసం NZ$5 మిలియన్ల (5 మిలియన్ల న్యూజిలాండ్ డాలర్లు) పెట్టుబడి పెట్టాలి.
- **బ్యాలెన్స్‌డ్ కేటగిరీ:** బాండ్లు లేదా ఇతర ఆస్తుల్లో ఐదేళ్ల పాటు కనీసం NZ$10 మిలియన్లు (10 మిలియన్ల న్యూజిలాండ్ డాలర్లు) పెట్టుబడిగా పెట్టాలి.
- **భాషా పరీక్ష మినహాయింపు:** ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. వీసా పొందాలంటే ఇంగ్లీష్ భాషా పరీక్ష (IELTS/TOEFL) అవసరం లేదు.
- **కుటుంబానికి ఆహ్వానం:** దరఖాస్తుదారులు తమ జీవిత భాగస్వామితో పాటు 24 ఏళ్ల లోపు పిల్లలను కూడా తీసుకెళ్లవచ్చు. అక్కడ నివసించడానికి, పని చేయడానికి, చదువుకోవడానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుంది. అంతేకాకుండా దేశంలో ఉండాల్సిన కనీస సమయాన్ని కూడా ప్రభుత్వం తగ్గించింది.




ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఈ వీసా తీసుకుంటున్న వారిలో కేవలం 30 శాతం మంది మాత్రమే శాశ్వతంగా అక్కడ నివసించాలని భావిస్తున్నారు. మిగిలిన వారు తమ కోసం ఒక 'సురక్షితమైన ప్రత్యామ్నాయ స్థావరం'గా న్యూజిలాండ్‌ను చూస్తున్నారు. సంవత్సరంలో కొన్ని నెలలు మాత్రమే అక్కడ గడిపేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. రాజకీయ స్థిరత్వం, మెరుగైన భద్రత (ముఖ్యంగా 2019లో సెమీ-ఆటోమేటిక్ ఆయుధాలపై నిషేధం తర్వాత) సంపన్నులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

**లగ్జరీ ఇళ్ల కొనుగోలుకు ప్రత్యేక అనుమతి**

సాధారణంగా న్యూజిలాండ్‌లో విదేశీయులు ఇళ్లు కొనుగోలు చేయడానికి అనుమతి ఉండదు. కానీ, గోల్డెన్ వీసా కింద అర్హత సాధించిన వారు NZ$5 మిలియన్ల పైబడిన ఖరీదైన ఇళ్లను కొనుగోలు చేయవచ్చు. దీంతో ఆక్లాండ్, క్వీన్స్‌టౌన్ లాంటి ప్రాంతాల్లో విదేశీ కొనుగోలుదారుల తాకిడి పెరిగింది. ముఖ్యంగా అమెరికా నుంచి రోజూ 3-4 ఇళ్ల ఎంక్వైరీలు వస్తున్నాయని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.






ఈ విదేశీ పెట్టుబడిదారులు కేవలం డబ్బు మాత్రమే కాకుండా, తమ నైపుణ్యాలు, అనుభవం, గ్లోబల్ నెట్‌వర్క్‌లను కూడా న్యూజిలాండ్‌కు తీసుకువస్తున్నారు. ప్రైవేట్ క్రెడిట్ పెట్టుబడుల ద్వారా స్థానిక చిన్న పరిశ్రమలకు, స్టార్టప్‌లకు ఆర్థిక ఊతం లభిస్తుండటంతో, రాబోయే రోజుల్లో ఈ 'గోల్డెన్ వీసా' న్యూజిలాండ్ ఆర్థిక వృద్ధికి మరింత బలమైన పునాది వేస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# జెన్ జీ చూపు.. స్టాక్ మార్కెట్ వైపు..



**స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు అంటే ఒకప్పుడు భయపడేవారు. కేవలం సంపన్న వర్గాలకు చెందిన వారు మాత్రమే అందులో నిలబడగలుగుతారని భావించేవారు. కానీ క్రమంగా ఆ భ్రమలు తొలగిపోయాయి. నైపుణ్యం, అవగాహన ఉన్న ఎవరైనా సరే అందులో పెట్టుబడులు పెట్టవచ్చని తరువాతి తరం నిరూపించింది. ముఖ్యంగా మిల్లెనియల్స్ భారీ ఎత్తున స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టడంతోపాటు ట్రేడింగ్ కూడా చేస్తున్నారని ఆర్‌బీఐ గణాంకాల్లో వెల్లడైంది. అయితే ఇక మిల్లెనియల్స్ వారసత్వాన్ని అందిపుచ్చుకున్న జెన్ జీ (Gen-Z) తరం ప్రస్తుతం స్టాక్ మార్కెట్ల వైపు వేగంగా అడుగులు వేస్తున్నట్లు తేలింది. తమ ముందు తరం వారి కన్నా వీరు ఇంకా ఎక్కువ సంఖ్యలో డీమ్యాట్ ఖాతాలను ఓపెన్ చేయడంతోపాటు ట్రేడింగ్, ఇన్వెస్టింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొంటున్నారని వెల్లడవుతోంది. అయితే ఇందుకు పలు కారణాలు కూడా ఉన్నాయని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.**

- **భారీగా పెరుగుతున్న యువ ఇన్వెస్టర్ల సంఖ్య..**

భారత్‌లో ఇన్వెస్టర్లు, ట్రేడర్లు అంటే గతంలో ఎక్కువగా వయస్సు పైబడిన వారు చేసేవారు. సంపాదన కాస్త స్థిరంగా ఉన్నా లేక ఆస్తులు ఉన్నా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టేవారు. అయితే ప్రస్తుతం మిల్లెనియల్స్‌తోపాటు జెన్ జీ తరం స్టాక్ మార్కెట్లలో చురుగ్గా ఉంటున్నారు. ప్రస్తుత భారత పెట్టుబడిదారుడి సగటు వయస్సు 30లలో ఉండగా, దాదాపు సగం మంది 30 సంవత్సరాలలోపు వారే కావడం విశేషం. తాజా గణాంకాల ప్రకారం స్టాక్ మార్కెట్లలో జెన్ జీ సెగ్మెంట్ కీలక శక్తిగా ఎదిగింది. వీరు ఎన్‌ఎస్‌ఈలో నమోదైన ఇన్వెస్టర్లలో ఎఫ్‌వై20లో సుమారు 25 శాతం ఉండగా, ఎఫ్‌వై25 నాటికి 40 శాతానికి పెరిగారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) డేటా కూడా ఈ ధోరణిని నిర్ధారించింది. 30 ఏళ్ల లోపు ఇన్వెస్టర్ల వాటా మార్చి 2019లో 22.6 శాతం ఉండగా అది జూలై 2025 నాటికి 38.9 శాతానికి పెరిగింది. దీంతో సగటు ఇన్వెస్టర్ వయస్సు 38 నుంచి 33కి తగ్గింది.

**70 శాతం అకౌంట్లు వారివే..**

భారత్‌లో 25 ఏళ్ల లోపు జనాభా సుమారు 60 కోట్ల మంది ఉన్నారు. వీరి మార్కెట్ భాగస్వామ్యం వేగంగా పెరుగుతోంది. ఎన్‌ఎస్‌ఈ 2022లో కొత్త డీమాట్ అకౌంట్లలో 43 శాతం పెరుగుదల నమోదైందని తెలిపింది. ఇందులో 18–30 ఏళ్ల వయస్సు గలవారే అధికంగా ఉన్నారు. ముఖ్యంగా జీరోధా, గ్రో, పేటీఎం మనీ వంటి ట్రేడింగ్ యాప్స్‌లో కొత్త యూజర్లలో 70 శాతానికి పైగా ఈ వయస్సు వర్గానికి చెందినవారే కావడం విశేషం. మొబైల్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు సులభంగా అందుబాటులో ఉండడమే ఈ పెరుగుదలకు కారణమని నిపుణులు చెబుతున్నారు. ఆయా ప్లాట్‌ఫామ్‌లు పెట్టుబడుల్లోనూ ఆధిపత్యం సాగిస్తున్నాయి. యాప్ ఆధారిత బ్రోకర్లు ప్రస్తుతం రిటైల్ ఈక్విటీ ఇన్వెస్టర్లలో దాదాపు 80 శాతం వాటా కలిగి ఉన్నారు. కొత్తగా నమోదవుతున్న సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) అకౌంట్లలో 55–60 శాతం వరకు టాప్ 30 నగరాల వెలుపల నుంచే వస్తున్నట్లు వెల్లడైంది.



**గోల్డ్ వద్దు.. ఈక్విటీలే ముద్దు..**

జెన్ జీ ఇన్వెస్టర్లలో 58 శాతం పెట్టుబడులు స్టాక్స్, ఈక్విటీ ఫండ్స్‌లోకి వెళ్తున్నాయి. గోల్డ్ వంటి సంప్రదాయ ఆస్తులతో పోలిస్తే ఇవే ఎక్కువ కావడం గమనార్హం. ఒక సర్వే ప్రకారం 45 శాతం జెన్ జీ యువత గోల్డ్ కంటే స్టాక్స్ లేదా సిప్‌లకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తేలింది.18–21 ఏళ్ల వయస్సు గలవారిలో 72 శాతం మంది ఈక్విటీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. చిన్న, మధ్య తరహా ఫండ్స్‌లో పెట్టుబడులు వేగంగా పెరుగుతున్నాయి. యువ ఇన్వెస్టర్ల పెరుగుదల దేశ ఆర్థిక వ్యవస్థపై గణనీయ ప్రభావం చూపుతోంది. రిటైల్ పెట్టుబడులు చిన్న, మధ్య తరహా వ్యాపారాలకు నిధులు అందిస్తున్నాయి. నాన్–మెట్రో ప్రాంతాల నుంచి వచ్చే పెట్టుబడులు మార్కెట్ స్థిరత్వాన్ని పెంచుతున్నాయి. దేశ ఆర్థిక నిపుణులు దీన్ని సానుకూల పరిణామంగా భావిస్తున్నారు. రిటైల్ భాగస్వామ్యం పెరుగుతుంటే, భారత ఆర్థిక వ్యవస్థ 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని చేరుకునే అవకాశాలు పెరుగుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

**మిల్లెనియల్స్, జెన్ జీ చేతుల్లో మ్యుచువల్ ఫండ్స్..**

2025 నాటికి మిల్లెనియల్స్ , జెన్ జీ కలిసి మొత్తం మ్యుచువల్ ఫండ్ ఆస్తుల్లో దాదాపు 48 శాతం వరకు నియంత్రిస్తున్నట్లు వెల్లడైంది. వారి ఖాతాల్లో రూ. 75.35 లక్షల కోట్లు ఉన్నాయి. అదే సంవత్సరం 35 ఏళ్ల లోపు వారు సుమారు 40 శాతం కొత్త సిప్ అకౌంట్లు ప్రారంభించారు. మెట్రో నగరాల్లోని జీతభత్యాల మిల్లెనియల్స్ ఎక్కువగా మ్యుచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడుతున్నారు. చిన్న నగరాల్లోని మిల్లెనియల్స్ ఇంకా అనుభవం పెంచుకుంటున్నారు. జెన్ జీ యువ ఉద్యోగులు సిప్‌లపై ఆసక్తి చూపుతున్నారు. జెన్ ఎక్స్ స్థిరమైన ఇన్వెస్టర్లు కాగా, స్వయం ఉపాధి నిపుణులు సమతుల్య రిస్క్ తీసుకుంటున్నారు. జెన్ జీ తరం మార్కెట్ ట్రెండ్స్‌కు వేగంగా స్పందిస్తున్నారు. వ్యాపారవేత్తలు ఎక్కువ రిస్క్ తీసుకునే వర్గంగా నిలుస్తున్నారు. ఇవన్నీ కలిసి భారత యువ ఇన్వెస్టర్ బేస్ పెరుగుతున్న విషయాన్ని సూచిస్తున్నాయి.

**దీర్ఘకాలిక పెట్టుడులకు ప్రాధాన్యం..**

కొత్త భారతీయ ఇన్వెస్టర్ కేవలం యువకుడే కాదు, దీర్ఘకాలిక సంపద సృష్టిపై దృష్టి సారిస్తున్నాడు. 2025లో 35 ఏళ్ల లోపు వారు 40 శాతం సిప్ అకౌంట్లు ప్రారంభించారు. జెన్ జీ 19 శాతం మంది సిప్‌లలో పెట్టుబడి పెడుతుండగా, మిల్లెనియల్స్‌లో ఇది 14 శాతంగా ఉంది. వీరిలో 84 శాతం మంది ఈక్విటీ మ్యుచువల్ ఫండ్స్‌ను ఎంచుకుంటున్నారు. మొత్తం మ్యుచువల్ ఫండ్ ఫోలియోల్లో సగం 30 ఏళ్ల లోపు వారివే కావడం విశేషం. ఇక స్టాక్ మార్కెట్‌లో యువత వేగంగా మార్పులు తీసుకొస్తోంది. త్వరిత లాభాల కంటే దీర్ఘకాలిక పెట్టుబడులకు ప్రాధాన్యం ఇస్తోంది. బెయిన్ అండ్ గ్రోవ్ విశ్లేషణ తెలిపిన ప్రకారం యువ ఉద్యోగులు తమ ఆస్తుల్లో 55–65 శాతం వరకు మ్యుచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. మొదట సిప్‌తో ప్రారంభించి, తర్వాత లంప్‌సమ్ పెట్టుబడులకు మారుతున్నారు. గత రెండేళ్లలో లంప్‌సమ్ ఇన్‌ఫ్లోలు 11 శాతం పెరిగాయి. వ్యాపారవేత్తల సెగ్మెంట్‌లో లంప్‌సమ్ పెట్టుబడులు ఐదు రెట్లు పెరిగాయి.

**పూర్తిగా డిజిటల్ మార్గాల్లోనే..**

కొత్త తరానికి చెందిన వారు పెట్టుబడులను పూర్తిగా డిజిటల్ మార్గాల్లోనే చేస్తున్నారు. ఫిన్‌టెక్ యాప్స్ ద్వారా స్మార్ట్‌ఫోన్‌తోనే పెట్టుబడి పెట్టడం సులభమైంది. అయితే నో యువర్ కస్టమర్ (కేవైసీ) ప్రక్రియలో 35 శాతం మంది కొత్త ఇన్వెస్టర్లు మధ్యలోనే బయటకు వెళ్లిపోతున్నారని సర్వేలు చెబుతున్నాయి. వేగంగా, సులభంగా ఆన్‌బోర్డింగ్ లేకపోతే యువత వెంటనే ప్లాట్‌ఫామ్ మార్చేస్తున్నారని తేలింది. ఇందుకు అనుగుణంగా ప్లాట్‌ఫామ్‌లు సైతం మార్పులను తీసుకొస్తున్నాయి. డిజిటల్ కేవైసీ, ఈ–సిగ్నేచర్ విధానాలు పెరిగాయి. అప్ స్టాక్స్ వంటి యాప్ ఆధారిత బ్రోకర్లు ఇప్పుడు రిటైల్ మార్కెట్‌లో అధిక భాగాన్ని ఆక్రమిస్తున్నారు. మొబైల్ వినియోగం వల్ల చిన్న పట్టణాల నుంచి కూడా కొత్త ఇన్వెస్టర్లు పెద్ద సంఖ్యలో చేరుతున్నారు.



**భవిష్యత్తులో యువ ఇన్వెస్టర్లు మార్కెట్‌ను మరింత ప్రభావితం చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. డిజిటల్ యాక్సెస్, ఫైనాన్షియల్ అవగాహన పెరుగుతున్న కొద్దీ వారి భాగస్వామ్యం విస్తరిస్తోంది. మొబైల్ ఫ్రెండ్లీ ప్లాట్‌ఫామ్‌లు, కొత్త పెట్టుబడి ఉత్పత్తులు అభివృద్ధి చెందనున్నాయి. భారత పెట్టుబడిదారుల ప్రపంచం ఇప్పటివరకు ఎన్నడూ లేనంతగా యువతతో నిండిపోయి ప్రస్తుతం ముందుకు సాగుతోందని అంటున్నారు.**



## అరాచకత్వానికి తావు లేదు..

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు..!

త్రినేత్ర.న్యూస్ :

శబరిమల కేసులో దాఖలైన పిటిషన్లపై మంగళవారం సుప్రీంకోర్టులో మరోసారి విచారణ జరిగింది. ఈ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. ఒక మత సంస్థను నిర్వహించే హక్కు అంటే.. అది కచ్చితంగా అరాచకత్వమేనని అర్థం కాదని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రతి సంస్థకు తన పని తీరుకు అనుగుణంగా నియమాలు, ప్రమాణాలు ఉండాల్సిందేనని పేర్కొంది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని రాజ్యాంగ బెంచ్ ఈ కేసును విచారించింది. ఈ బెంచ్‌లో న్యాయమూర్తులు బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అహ్సానుద్దీన్ అమానుల్లా తదితరులు ఉన్నారు. గతంలో మతాచారాలు తప్పని సరి లేదా కాదో నిర్ణయించడం న్యాయస్థానాలకు క్లిష్టమని సుప్రీంకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. 2018 సెప్టెంబర్‌లో ఐదుగురు న్యాయమూర్తుల బెంచ్ 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలో పది నుంచి 50 సంవత్సరాల మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. ఆ ఆచారం రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం, మత స్వేచ్ఛకు సంబంధించిన విస్తృత అంశాలపై ప్రస్తుత బెంచ్ విచారిస్తోంది.



## మతం అడిగి..

- ఇస్లాం 'కల్మా' చదవలేదని సెక్యూరిటీ గార్డులపై కత్తితో ఉన్మాది దాడి

త్రినేత్ర.న్యూస్ :

మహారాష్ట్ర రాజధాని ముంబైలో దారుణ ఘటన వెలుగుచూసింది. ఇద్దరు సెక్యూరిటీ గార్డులను వారి మతం గురించి అడిగి, ఆపై కత్తితో దాడి చేసిన ఘటన నయా నగర్ ప్రాంతంలో కలకలం రేపింది. నిందితుడిని 31 ఏళ్ల జైబ్ జుబేర్ అన్సారీగా గుర్తించిన పోలీసులు, అతడిని అరెస్టు చేసి విచారణ ప్రారంభించారు. సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు వోకార్డ్ ఆసుపత్రి వెనుక నిర్మాణంలో ఉన్న ఒక భవనం వద్ద విధులు నిర్వర్తిస్తున్నారు. అక్కడికి చేరుకున్న అన్సారీ.. వారి మతం గురించి ఆరా తీశాడు. 'కల్మా' చదవాలని వారిని ఆదేశించాడు. వారు చదవలేకపోవడంతో ఒక్కసారిగా కత్తితో దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో ఇద్దరు గార్డులకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న రాజ్‌కుమార్ మిశ్రా ఎలాగోలా సొంతంగా ఆసుపత్రికి చేరుకోగా, గాయపడి సెక్యూరిటీ బూత్‌లో దాక్కున్న సుబ్రతో సేన్‌ను.. నయాబ్ షేక్ అనే స్థానికుడు గమనించి, ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# ఇక బలవంతపు అప్ డేట్స్ లేవు..

- విండోస్ 11లో మార్పులు చేసిన మైక్రోసాఫ్ట్..
- యూజర్లకు భారీ ఊరట..

త్రినేత్ర.న్యూస్ :




**టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ తన విండోస్ యూజర్లకు శుభవార్త చెప్పింది. విండోస్ అప్‌డేట్స్‌ను ఇకపై మరింత మెరుగ్గా నియంత్రించేందుకు కొత్త అప్‌డేట్‌ను అందించనున్నట్లు ప్రకటించింది. దీని వల్ల యూజర్లను అప్‌డేట్స్ ఇక ఇబ్బంది పెట్టవని ఆ సంస్థ స్పష్టం చేసింది. విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లో అప్ డేట్స్ వస్తే వాటిని ఎక్కువ రోజుల పాటు ఆపి ఉంచడం ఇబ్బందయ్యేది. కచ్చితంగా అప్ డేట్ చేస్తేనే పీసీ రీస్టార్ట్ లేదా షట్ డౌన్ అయ్యే విధంగా ఇప్పటి వరకు ఫీచర్‌ను ఇచ్చారు. ఇప్పుడు అప్ డేట్స్‌ను కచ్చితంగా ఇన్‌స్టాల్ చేయాల్సిన అవసరం లేకుండానే తమ పీసీలను షట్ డౌన్ లేదా రీస్టార్ట్ చేసుకోవచ్చు.**

సాధారణంగా విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఓఎస్‌కు సంబంధించి లేదా సెక్యూరిటీ అప్‌డేట్స్ ను సిస్టమ్ డిఫాల్ట్‌గా ఎప్పటికప్పుడు సిద్ధం చేసి ఇస్తుంది. అప్‌డేట్స్‌ను డౌన్ లోడ్ చేయడం లేదా ఇన్‌స్టాల్ చేయడం కొద్ది రోజుల వరకే పాజ్ చేసుకునే వీలుంది. ఆ గడువును తరువాత పొడిగించేందుకు వీలు కావడం లేదు. దీంతో యూజర్లు తమ పీసీని ఆఫ్ చేయాలంటే కచ్చితంగా ముందు అప్‌డేట్స్‌ను ఇన్‌స్టాల్ చేయాల్సి ఉంటుంది. లేదా రీస్టార్ట్ చేసినా సరే అప్‌డేట్స్ ఇన్‌స్టాల్ చేయాల్సిందే. అప్ డేట్స్ అనేవి యూజర్ ఖాళీ సమయాల్లో చేస్తే ఓకే. కానీ అత్యవసర పరిస్థితుల్లో లేదా ప్రయాణాల్లో ఉన్నప్పుడు అప్‌డేట్స్ కచ్చితంగా ఇన్‌స్టాల్ చేయాల్సిందే అని చూపిస్తే యూజర్లకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటి వరకు విండోస్ యూజర్లకు ఇదే పెద్ద సమస్యగా మారింది. అయితే దీనికి మైక్రోసాఫ్ట్ మార్పులు చేసింది. అప్‌డేట్స్ ను యూజర్లు కావల్సినన్ని రోజులు పాజ్ చేయడంతోపాటు కావాలనుకున్న సమయంలోనే వాటిని ఇన్ స్టాల్ చేసుకునే విధంగా ముందస్తుగా సిస్టమ్‌కు సెట్టింగ్స్ మార్చవచ్చు. ఈ కొత్త అప్‌డేట్‌ను మైక్రోసాఫ్ట్ తన తదుపరి ఓఎస్ అప్‌డేట్స్‌లో ఇవ్వనుంది.

**మార్పులతో కూడిన ఓఎస్ అప్ డేట్..**

మైక్రోసాఫ్ట్ చేసిన ఈ మార్పుతో కూడిన అప్‌డేట్ విండోస్ 11 యూజర్లకు విండోస్ 11 బిల్డ్ 26300.8289 వెర్షన్‌లో లభిస్తోంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న యూజర్లకు దశలవారీగా అందుబాటులోకి వస్తోంది. యూజర్లు తమ పీసీలో ఈ బిల్డ్ వెర్షన్ అప్‌డేట్ వచ్చిందో లేదో చెక్ చేసుకుంటూ ఉండి, అప్ డేట్ రాగానే దానిని ఇన్ స్టాల్ చేయడం మంచిది. ఇక విండోస్ 11 యూజర్లు ఎదుర్కొంటున్న మరో ప్రధాన సమస్యను కూడా మైక్రోసాఫ్ట్ పరిష్కరించింది. విండోస్ పీసీలో ఉండే షట్ డౌన్ అనే బటన్‌ను క్లిక్ చేస్తే చాలా మంది తమ పీసీ రీస్టార్ట్ అవుతుందని ఫిర్యాదులు చేశారు. దీంతో ఆ సమస్యకు కూడా ఫిక్స్‌ను ఈ వెర్షన్‌లోనే సంస్థ అందిస్తోంది.

**బలవంతపు అప్ డేట్స్‌కు చెక్..**

ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్ వాదన మాత్రం పూర్తి భిన్నంగా ఉంటూ వచ్చింది. కేవలం సెక్యూరిటీ రిస్క్‌లు ఉంటాయన్న సాకుతో ఆటోమేటిక్ అప్ డేట్స్‌పై యూజర్లకు అసలు నియంత్రణ లేకుండా వ్యవహరించింది. ఎట్టకేలకు దిగివచ్చిన మైక్రోసాఫ్ట్ సదరు ఆటో అప్ డేట్స్‌పై యూజర్లకు పూర్తి కంట్రోల్ ఉండేలా మార్పును తీసుకువచ్చింది. దీంతో విండోస్ యూజర్లకు భారీ ఊరట లభించింది.




# మిత్రుల నౌకలకే దారి

- హార్ముజ్ జలసంధి మూసివేత


త్రినేత్ర.న్యూస్ :

**ప్రపంచ దేశాల చూపు ఇప్పుడు మధ్యప్రాచ్యంపైనే ఉంది. అమెరికా - ఇరాన్ దేశాల మధ్య జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష యుద్ధ వాతావరణం కారణంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి' దాదాపుగా మూతపడింది. ఈ ఉద్రిక్తతల నడుమ, ఎంతో విలువైన ఓ రష్యా సూపర్ యోట్ జలసంధిని అత్యంత సురక్షితంగా దాటడం హాట్ టాపిక్‌గా మారింది.**

రష్యాకు చెందిన ప్రముఖ ఉక్కు వ్యాపారి, బిలియనీర్ అలెక్సీ మోర్డాషోవ్ కు చెందిన ఈ 'నోర్డ్' నౌక ప్రయాణం.. అనేక దౌత్య, రాజకీయ చర్చలకు దారితీస్తోంది. మరైన్ ట్రాఫిక్ ప్లాట్‌ఫామ్ నమోదు చేసిన డేటా ప్రకారం.. 142 మీటర్ల పొడవున్న ఈ 'నోర్డ్' సూపర్ యోట్ శుక్రవారం మధ్యాహ్నం 14:00 GMT సమయంలో దుబాయ్ మెరీనా నుంచి బయలుదేరింది. శనివారం ఉదయం అత్యంత పకడ్బందీగా ఉండే హార్ముజ్ జలసంధిని విజయవంతంగా దాటి, ఆదివారం తెల్లవారు జామున ఒమన్ రాజధాని మస్కట్ కు సురక్షితంగా చేరుకుంది. జలసంధి మార్గంలో ట్రాఫిక్‌ను ఇరాన్ తీవ్రంగా పరిమితం చేసింది. ఒకప్పుడు సగటున రోజుకు 125 నుంచి 140 నౌకలు ప్రయాణించే ఈ మార్గంలో.. కేవలం కొన్ని అత్యవసర వాణిజ్య నౌకలు మాత్రమే ప్రయాణిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ విలాసవంతమైన నౌకకు జలసంధిని ఉపయోగించుకునే అనుమతి ఎలా లభించిందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ఈ నౌక విలువ సుమారు 500 మిలియన్ డాలర్లకు పైనే (అంటే మన కరెన్సీలో రూ.4,100 కోట్లకు పైగా) ఉంటుంది. సూపర్ యోట్ టైమ్స్ నివేదిక ప్రకారం, ప్రపంచంలోని అతి పెద్ద విలాసవంతమైన నౌకలలో ఇది ఒకటి. దీనిలో 20 లగ్జరీ స్టేట్‌రూమ్‌లు, ఒక పెద్ద స్విమ్మింగ్ పూల్, ఒక హెలిప్యాడ్, సముద్ర గర్భంలోకి వెళ్లేందుకు వీలుగా ఒక మినీ జలాంతర్గామి కూడా ఉన్నాయి. ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర తర్వాత రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ఉన్న సాన్నిహిత్యం కారణంగా.. అమెరికా, యూరోపియన్ యూనియన్ (EU) ఆంక్షలు విధించిన రష్యన్ బిలియనీర్ల జాబితాలో మోర్డాషోవ్ ఒకరు కావడం విశేషం.

అమెరికా నిరంతర ఆంక్షలకు ప్రతిచర్యగా.. ఇరాన్ పోర్టులను అమెరికా నావికా దళాలు దిగ్బంధించాయి. ఈ ఉద్రిక్తతల నడుమ రష్యాకు చెందిన సూపర్ యోట్ సులభంగా జలసంధిని దాటడం వెనుక బలమైన దౌత్య కారణాలు ఉన్నాయని నిపుణులు భావిస్తున్నారు. రష్యా, ఇరాన్ దేశాలు చిరకాల మిత్రదేశాలు. ముఖ్యంగా ఇరు దేశాలపై అమెరికా ఆంక్షలు విధిస్తున్న కొద్దీ ఈ దేశాల మధ్య బంధం మరింత బలపడుతోంది.



## పెరిగిన ఇంధన భారం

త్రినేత్ర.న్యూస్ :

పెరిగిన ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ATF) ధరల కారణంగా దేశీయ విమానయాన సంస్థలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముడిచమురు ధరలు భారీగా పెరగడంతో, ఇంధన ఖర్చు విమాన నిర్వహణ వ్యయంలో 60 శాతానికి చేరుకుంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు ATF పై ఉన్న 11% ఎక్సైజ్ డ్యూటీని తాత్కాలికంగా తొలగించడంతో పాటు పన్నుల భారాన్ని తగ్గించాలని ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (FIA) పౌర విమానయాన మంత్రిత్వ శాఖను కోరింది.

## స్టాక్ మార్కెట్స్

| | |
|---|---|
| NIFTY | - ▼ 23,995 |
| SENSEX | - ▼ 76,886 |

**డాలర్ వర్సెస్ రూపాయి**

1 డాలర్ కు

94.55 రూపాయలు

**బులియన్ మార్కెట్**

- 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,51,910
- 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,39,250
- వెండి ధర (ఒక కిలో) - రూ.2,65,000





# ఓటీటీలోకి మృణాల్ మూవీ..

అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన డెకాయిట్ డిఫరెంట్ లవ్‌స్టోరీగా నిలిచింది. కమర్షి–యల్‌గా మాత్రం ఆశించిన విజయాన్ని అందుకోలే–దు. ఈ సినిమా ఏ ఓటీటీలో ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ కానుందంటే..అడివిశేష్, మృణాల్ ఠాకూర్‌కు ఉన్న క్రేజ్ కారణంగా థియేట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ సినిమా డిజిటల్ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ ఖరారైనట్లు సమాచారం. మే 8న అమెజాన్ ప్రైమ్‌లో రిలీజ్ కాబోతున్నట్లు చెబుతోన్నారు. డెకాయిట్‌లో హీరోగా నటిస్తూనే ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లేను అందించారు అడివిశేష్. మృణాల్ ఠాకూర్ ఓ చిన్నారికి తల్లిగా ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించింది. ఈ మూవీకి భీమ్స్ మ్యూజిక్ అందించగా సుప్రియా యార్లగడ్డ నిర్మించారు.



# గ్లోబల్ స్టేజ్‌పై అవార్డ్ ప్రజెంటర్‌గా..

తెలంగాణ కోడలు రశ్మిక మందన్న గ్లోబల్ స్టేజ్‌పై మెరవబోతుంది. ప్రతిష్టాత్మక గ్లోబల్ యానిమేషన్ అవార్డ్స్ వేడుకకు ప్రజెంటర్‌గా వ్యవహరించబోతున్నది. యానిమేషన్ రంగంలో ప్రతిభ చాటిన సినిమాలు, సిరీస్‌లతో పాటు టెక్నీషియన్లకు గత పదేళ్లుగా అవా–ర్డులను అందిస్తున్నారు. ఏటా జపాన్‌లోని టోక్యోలో ఈ అవార్డుల సెలబ్రేషన్స్ జరుగుతుంటాయి. పదో ఎడిషన్ వేడుకలు ఈ ఏడాది మే 23న నిర్వహించనున్నారు.

ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో అవార్డ్ ప్రజెంటర్‌గా రశ్మిక వ్యవహరించనుంది. ఈ ఏడాది ఈ ఈవెంట్‌లో పా–ల్గొననున్న ఏకైక ఇండియన్ సెలబ్రిటీ ఆమెనే కావడం విశేషం. ఈ హోదాలో ఈవెంట్‌కు అటెండ్ కావడం ఇది రెండోసారి. దిగ్గజ సింగర్ వీకెండ్ తో పాటు పలువురు హాలీవుడ్ స్టార్స్ గెస్ట్‌లుగా హాజరు కాబో–తున్నారట. మే మూడో వారంలో నేషనల్ క్రష్ టోక్యో వెళ్లనున్నట్లు తెలిసింది.



# ఆ మూవీలో విలన్‌గా..

ఏ మాయ చేశావే నుంచి ఖుషి వరకు గ్లామర్, యాక్షన్ ఒరియెంటెడ్, ఫిమేల్ సెంట్రిక్ ఇలా డిఫరెంట్ జానర్స్‌లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది సమంత. ఓ సినిమాలో విలన్‌గా చేసి తనలోని నెగెటివ్ షేడ్‌ను బయటపెట్టింది. ఆ డిజాస్టర్ మూవీ ఏదంటే.. ఎంద్రాదుకుల్లాలో చియాన్ విక్రమ్, సమంత నటించగా మురుగదాస్ ఈ చిత్రాన్ని నిర్మించారు. రిలీజ్‌కు ముందే అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తించింది. ఇందులో సమంత డ్యూయల్ రోల్‌లో నటించింది. రెండు పాత్రల్లో ఓ క్యారెక్టర్‌లో నెగెటివ్ షేడ్స్‌తో సాగడం గమనార్హం. ఓ ఊచకోత కేసులో ఉరి శిక్ష పడిన ఖైదీగా పవర్‌ఫుల్ విలన్ రోల్‌లో నటించింది. తన విలనిజంతో ఆడియెన్స్‌ను సర్‌ప్రైజ్ చేసింది. క్యారెక్టర్‌లోని ట్విస్ట్ బాగున్నా అనుకున్న స్థాయిలో మూవీ ఆడలేదు. దాదాపు నలభై కోట్ల బడ్జెట్‌తో రూపొందగా 20 కోట్ల లోపే వసూళ్లను దక్కించు–కుంది. తెలుగులోనూ రిలీజైన విషయం ఆడియె–న్స్‌కు తెలిసేలోపే థియేటర్ల నుంచి వెళ్లిపోయింది.

Cinema



# చోళీకే పీచే క్యా హైలో మిల్కీ బ్యూటీ స్టెప్పులు!

బాలీవుడ్ కల్ట్ క్లాసిక్ మూవీ ఖల్ నాయక్‌కు సీక్వెల్ రాబోతుంది. ఖల్ నాయక్ రిటర్న్స్ పేరుతో ఈ సీక్వెల్‌ను ఇటీవల సంజయ్ దత్ అనౌన్స్ చేశారు. అప్పట్లో ఓ ఊపు ఊపిన 'చోళీకే పీచే క్యా హై' పాటను ఈ సినిమా కోసం రీమిక్స్ చేయబోతున్నారట. అప్పుడు మాధురీ దీక్షిత్ ఈ పాటతో జోష్ నింపగా ఇప్పుడు తమన్నా ఆడిపాడనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇందు కోసం ఇప్పటికే తమన్నాను మేకర్స్ అప్రోచ్ అయ్యారట. దీనికి ఆమె కూడా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఒరిజినల్ సాంగ్‌కు ఏ మాత్రం తీసిపోని విధంగా అదిరిపోయే స్టెప్పులతో రీమిక్స్ సాంగ్ ఉండనుందట.

ఈ మూవీని సంజయ్ దత్ స్వయంగా నిర్మిస్తుండగా సుభాష్ ఘాయ్ దర్శకత్వ పర్యవేక్షణలో తెరకెక్కుతోంది. నటీనటులు, టెక్నీషియన్ల ఎంపిక పూర్తి కాగా త్వరలోనే మరో భారీ ఈవెంట్‌తో పూర్తి వివరాలను రివీల్ చేయబోతున్నట్లు సమాచారం.